ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 12 ఏప్రిల్ 2025





కల్యాణం.. కమనీయం...



కల్యాణోత్సవంలో చంద్రబాబు దంపతులు

భక్తులతో కిక్కిరిసిపోయిన కల్యాణ వేదిక ప్రాంగణం

సీతారాముల కల్యాణఘట్టం

- పండువెన్నెల్లో అంగరంగ వైభవంగా జరిగిన సీతారాముల కల్యాణం
- లక్షలాదిగా హాజరైన భక్తులు..
- పులకించిన కల్యాణ ప్రాంగణం
- ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు
- అధికారుల సమిష్టి కృషితో కల్యాణోత్సవం విజయవంతం

రాజంపేట/ఒంటిమిట్ట/కడప, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నెలరాజు పండు వెన్నెల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య సీతారామ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామ భక్తుల రామనామ సంకీర్తనలు, పండితుల చతుర్వేద పఠనం.. మంగళవాయిద్యాల నడుమ.. శుక్రవారం రాత్రి 8.10 గంటలకు విశ్వావసు నామ సంవత్సర ఉత్తరాయణ, చైత్రమాస శుక్లపక్ష చతుర్థశి, హస్తా నక్షత్ర ప్రయుక్త తులాలగ్న శుభ ముహూర్తంలో దశరథమహారాజు తనయుడు, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులు శ్రీరామ చంద్రమూర్తి, అఖిల జగన్మాత శ్రీ జనక మహారాజ పుత్రిక సీతమ్మను పరిణయమాడారు. రమణీయం.. కమనీయమైన ఈ సుందర దృశ్యాన్ని తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. లోకకల్యాణార్థం.. జగమేలే వైకుంఠ రాముడి జగత్ కల్యాణం ఆంధ్రాభద్రాద్రి ఏకశిలానగిరి ఒంటిమిట్ట జగదభిరాముడి దివ్యక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతే అన్న రీతిలో జరిగింది. కోదండరామయ్య సీతమ్మ వారిని పరిణయమాడిన వేళ శిల్పకళా శోభితమైన కల్యాణ మండపం వైకుంఠాన్ని తలపించింది. ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సీఎం సతీమణి నారా భువనేశ్వరి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను స్వామి వారికి సమర్పించారు.

కనులపండువగా కల్యాణం

ఒంటిమిట్ట కోదండరామాలయంలో శుక్రవారం రాత్రి కోదండరాముని కల్యాణ వేడుకను వేదపండితులు వేదమంత్రాల మధ్య నిర్వహించారు. మొదటిగా సీతారామచంద్రులకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలు, టీటీడీ అందించిన

- మిగతా 6వ పేజీలో



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న సీఎం దంపతులు



పట్టువస్త్రాలు అందచేస్తున్న సీఎం చంద్రబాబు



చంద్రబాబు దంపతులకు ప్రసాదం అందచేస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు





స్వామి, అమ్మవార్లను కల్యాణ వేదిక వద్దకు తెస్తున్న దృశ్యం



యజ్ఞోపవీతధారణ



కల్యాణం అనంతరం మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పాడా పనులపై..
విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం

- నాలుగు టీమ్‌లు, 356 పనులు

పులివెందుల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) కింద చేపట్టిన పనుల తనిఖీల్లో విజిలెన్స్ వేగం పెంచింది. ఐదు రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా తనిఖీల్లో మునిగి తేలుతోంది. అందులో భాగంగా శుక్రవారం పులివెందుల మండలంలోని మల్లికార్జునపురం, నల్లగొండువారిపల్లె తదితర ప్రాంతాల్లో సీసీరోడ్ల తనిఖీలు సాగాయి. సీసీ రోడ్లకు డ్రిల్ చేసి వాటి శాంపిల్స్‌ను సేకరించారు. అలాగే లింగాల మండలం కోమన్నూతలలో సీసీరోడ్లను తనిఖీ చేశారు. సింహాద్రిపురం మండలంలో సాగునీటి కాల్వల మట్టి పనుల నాణ్యతపైన, అలాగే పైడిపాళెంలో ఎలక్ట్రికల్ పనులపైన తనిఖీలు సాగాయి. తొండూరు మండలంలో గంగాదేవపల్లె, మల్లేల గ్రామాల్లో సీసీరోడ్ల నాణ్యత పరిశీలించారు. ఐదురోజులుగా నియోజకవర్గంలోని వేంపల్లె, చక్రాయపేట, వేముల, సింహాద్రిపురం, తొండూరు, లింగాల, పులివెందుల మండలాల్లో సీసీరోడ్లు, కాల్వలు, ఎలక్ట్రికల్ పనుల నాణ్యతపై నాలుగు టీములతో తనిఖీలు సాగుతున్నాయి. కాగా.. పాడాలో మొత్తం 356 పనులు చేపట్టారు. ఈ పనుల్లో నాణ్యత పూర్తిగా కొరవడిందని, చేసిన పనులకంటే నిధులు ఎక్కువ అందించారని ఆరోపణలు వచ్చాయి. పాడా అంటే వైసీపీ నాయకులకు పాడి ఆవులా మారిందని కూటమి నాయకులు పెద్దఎత్తున ఆరోపణలు గుప్పించారు. ఈ నేపథ్యంలో పాడా నిధుల దుర్వినియోగం, పనుల నాణ్యతపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టింది. నాణ్యత తనిఖీలు మరో ఐదు రోజుల పాటు సాగే అవకాశం ఉంది.



మల్లేల వద్ద జగనన్న కాలనీలో సీసీరోడ్డు నాణ్యత పరిశీలించేందుకు డ్రిల్ చేస్తున్న సిబ్బంది

వైవీయూ విద్యార్థికి స్వర్ణపతకం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ విశ్వవిద్యాలయంలో ఈనెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరిగిన అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో యోగివేమన విద్యాయం విద్యార్థికి స్వర్ణపతకం లభించింది. విద్యార్థి డి.మురళీకృష్ణ 59 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించారు. బీపీఎడ్ రెండో సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థి గత ఏడాది కూడా బంగారు పతకం సాధించడంతో వైవీయూ క్రీడా బోర్డు ద్వారా రూ.30వేల ప్రోత్సాహక నగదు, ప్రతినెల రూ.10వేల పారితోషికం అందజేస్తున్నారు. బంగారు పతకం సాధించిన మురళీకృష్ణను యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, కులసచివులు ఆచార్య పుత్తాపద్మ, ప్రధానాచార్యులు ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి అభినందించారు.



స్వర్ణ పతకం సాధించిన విద్యార్థి మురళీకృష్ణ

వెబ్‌సైట్‌లో స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టు పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితా ఆర్జేడీ వెబ్‌సైట్‌లో ఉందని ఆర్జేడీ కె.శామ్యూల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 16లోపు తగిన ఆధారాలతో సంబంధిత డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

కడప క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావుపూలే జీవితం ప్రపంచానికి ఆదర్శమని అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు కొనియాడారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే సామాజిక తత్వవేత్తగా సమాజంలో అనేక విధాలుగా ప్రజలను చైతన్యం చేశారని అన్నారు. ప్రజల్లో అనాదిగా పాతుకుపోయిన వివక్షను నిర్మూలించేందుకు తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. వితంతు పునర్వివాహం గురించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి సాధికారత కోసం కృషిచేసిన మహనీయుడన్నారు. దీనబంధు అనే పత్రిక ద్వారా పేదలు, కార్మికుల సమస్యలు సమాజానికి తెలిసేలా చేశారన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సమసమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, టైటాస్, వీరేశ్, శ్రీశైలరెడ్డి, శివరాముడు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ ప్రకాశ్‌బాబు

నేడు కూడా రిజిస్ట్రేషన్లు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నేడు రెండవ శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదున్నరగంటల వరకు జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. ఈ మేరకు స్థిరాస్థుల రిజిస్ట్రేషన్ క్రయ, విక్రయదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.





కల్యాణం.. కమనీయం..



సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న ముఖ్యమంత్రి దంపతులు






ఎదుర్కోలు దృశ్యం



కోదండరాముడి ఊరేగింపు దృశ్యం









(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఉత్సవరులను పల్లకీపై కొలువు దీర్చి ప్రధాన ఆలయం నుంచి మంగళవాయిద్యాల మధ్య భక్తుల శ్రీరామ.. జయజయరామ ధ్వానాలతో కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. వేదికపైన రజిత సింహాసనంపై కల్యాణమూర్తులను ఆశీనులు చేసిన అనంతరం పూజా సామాగ్రికి సంప్రోక్షణ జరిపి ఎలాంటి విఘ్నాలు, ఆటంకాలు తలెత్తకుండా విశ్వక్సేనపూజ జరిపించారు. కర్మణ్యే పుణ్యాహవచనం అనే మంత్రంతో మంటపశుద్ధి జరిపి కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. ముంజానికీ ప్రథమం అనే మంత్రం చదువుతూ రామయ్యను సీతమ్మను ఎదురెదురుగా కూర్చొండబెట్టి కన్యావరణం జరిపించారు. మోక్ష బంధనం, ప్రతిసర బంధనం, ద్వితీయ సువర్ణయజ్ఞోపవీత ధారణం చేసిన అనంతరం ఆశీర్వచనం, ప్రాధప్రక్షాళనం, పుష్పోదకస్నానం నిర్వహించి వరపూజ జరిపించారు.. మధుపర్కపాసన అనంతరం పెరుగు, తేనె కలిపిన మిశ్రమాన్ని స్వామి వారికి నివేదించాక నునుసిగ్గుల మొలక అయిన సీతమ్మ నొసటన కల్యాణ బొట్టును, బుగ్గన కాసింత దిష్టిచుక్క పెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్పించిన పట్టు వస్త్రాలు సమర్పించి పెళ్లికూతురుగా అందంగా ముస్తాబు చేశారు. ఆమెకు ఏమాత్రం తీసిపోని విధంగా శివధనస్సు విరిచిన శ్రీరామ చంద్రమూర్తి అదే రీతిలో సీతమ్మ ఎదుట కూర్చొన్నాడు. తరువాత లోక క్షేమం కోసం మహాసంకల్పం పఠించి కన్యాదానం, గోదానం, భూదానం జరిపించారు. సీతమ్మకు, రామయ్యకు ఒక్కొక్కరికీ 8 శ్లోకాలతో మంగళకాష్టం చదివారు. మంగళవాయిద్యాలు.. వేదపండితుల చతుర్వేద పఠనం.. భక్తుల రామనామ ధ్వనుల మధ్య సీతారాముల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. అనంతరం గౌరీ దేవి, సరస్వతిదేవి, మహాలక్ష్మీ అమ్మవార్లను ఆవాహనం చేసి సకలమంగళాలకు ఆలవాలమైన మంగళసూత్రానికి పూజ చేశారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర వేదపండితులు కంకణబట్టర్ రాజేష్‌కుమార్ మంగళసూత్రాన్ని భక్తులకు చూపించి సాక్షాత్తు లక్ష్మీనారాయణుడైన శ్రీరామ చంద్రమూర్తి చేత మహాలక్ష్మి స్వరూపిణి సీతామహాదేవికి 8.10 గంటలకు శాస్త్రోక్తంగా మంగళసూత్రాధారణ జరిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెచ్చిన ముత్యాల తలంబ్రాలు కల్యాణ మూర్తుల శిరస్సులపై పోసి కన్నుల పండువగా కల్యాణం జరిపించారు. అనంతరం నివేదన ఇచ్చి బ్రహ్మముడి వేశాక మహదాశీర్వచనం నిర్వహించారు. హారతి ఇవ్వడంతో సీతారాముల కల్యాణ క్రతువు ముగిసింది. ఈ సందర్భంగా కల్యాణ వేదిక ప్రాంగణం చుట్టూ వైకుంఠాన్ని తలపించే విద్యుత్ దీప కాంతులు, వివిధ దేవతామూర్తుల విద్యుత్ కటౌట్‌లు కల్యాణోత్సవానికి మరింత శోభను తెచ్చిపెట్టాయి. కల్యాణోత్సవాన్ని భక్తులు దగ్గరగా తిలకించేందుకు వీలుగా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, ఉక్కపోతతో భక్తులు ఇబ్బందులు పడకుండా ఏసీలు, కూలర్‌లను కల్యాణ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవానికి అనేక ప్రాంతాల నుంచి తరలి వచ్చిన లక్ష మందికి పైగా భక్తులు వీక్షించి ముగ్ధులయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ అధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి భక్తుడికి మంచినీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను అందజేశారు.

రామ నామస్మరణతో మార్మోగిన ఒంటిమిట్ట

ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి కల్యాణ వేదిక వద్దకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి సాయంత్రానికే కల్యాణ వేదిక వద్దకు చేరుకున్నారు. ఎటుచూసినా భక్తుల శ్రీరామనామంతో కల్యాణ ప్రాంగణం మార్మోగింది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని అన్ని మండల కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులు, ఇతర వాహనాల్లో భారీ ఎత్తున ఒంటిమిట్టకు తరలివచ్చారు. జనసంద్రంతో కల్యాణవేదిక కిటకిటలాడిపోయింది. ఇటు చెన్నై, అటు కడప ప్రధాన రహదారులన్నీ భక్తులతో కిటకిటలాడిపోయాయి. ఎటుచూసినా వాహనాలు కిక్కిరిసిపోయాయి. నేల ఈనిందా అన్న రీతిలో కోదండరాముడి కల్యాణ వేదిక వద్దకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఓ రామా.. నీ నామమెంతో రుచిరా.. రామా.. రామా.. రామా.. అన్న రీతిలో జనసంద్రం తరలివచ్చింది. తిరుమల తిరుపతి దేవస్థానం అంతా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ ఆగమశాస్త్ర పండితులు కంకణబట్టర్ రాజేష్‌కుమార్, పురోహితులు భారీ ఎత్తున తరలివచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం కనీవిని ఎరుగని రీతిలో శ్రీవారి సేవకులను ఉపయోగించి భారీ ఎత్తున కల్యాణోత్సవ ఏర్పాట్లను చేశారు.

అలరించిన సంకీర్తనలు

ఒంటిమిట్ట సీతరాముల కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం కల్యాణవేదికపై ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు వందన, కళాశాల విద్యార్థులు ఆలపించిన సంకీర్తలు భక్తులను మైమరిపించాయి. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు అధ్యాపకులు, విద్యార్థులు ఆలపించిన రామ రామా.. రఘురామా... పరమాత్మరా... పాహి కల్యాణ రామ పావన గుణరామా... ఎక్కడ చూసినా మన శ్రీరాముడే... తదితర సంకీర్తనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి.

సీతారాములకు శ్రీవారి కానుక

కల్యాణం సందర్భంగా తిరుమల నుంచి వేంకటేశ్వర స్వామి శుక్రవారం కానుకలు పంపారు. కల్యాణానికి స్వర్ణ కిరీటం, యజ్ఞోపవీతం ఆభరణాలను కానుకగా అందించారు. టీటీడీ ఆనవాయితీలో భాగంగా శుక్రవారం ఈ ఆభరణాలను సమర్పించారు. ఆలయం ముందు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు ఆభరణాలకు పూజలు చేసి కోదండరామునికి అందజేశారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఎం సతీమణి నారా భువనేశ్వరి, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కడప ఇన్‌చార్జి మంత్రి సవిత, రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్, టీటీడీ ఈవో శ్యామలరావు, కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కడప ఎస్పీ అశోక్‌కుమార్, అన్నమయ్య ఎస్పీ విద్యాసగర్‌నాయుడు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డిలతో పాటు ఉమ్మడి కడప జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు



అదృశ్యమైన శంకర్‌రెడ్డి

రామసముద్రం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన రామసముద్రం మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మూగవాడి గ్రామానికి చెందిన జి.శంకర్‌రెడ్డి పుంగనూరులోని ఓ ప్రైవేట్ బ్యాంకులో వ్యక్తిగత అవసరాల కోసం కొంత డబ్బు రుణం తీసుకున్నాడు. అయితే డబ్బు తిరిగి వసూలు చేసే క్రమంలో బ్యాంకు అధికారుల వేధింపులు తాళలేక శంకర్‌రెడ్డి ఈనెల 10న అదృశ్యమయ్యారు. అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి సోదరుడు శుక్రవారం రామసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దారి విషయమై ఘర్షణ.. గాయపడిన మహిళ

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యవరం రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి గోడ దారి విషయమై శుక్రవారం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, అదే గ్రామానికి చెందిన మహిళపై దాడి చేశారు. ఈ సంఘటనలో రాజేశ్వరి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం చియ్యవరం గ్రామానికి చెందిన రాజేశ్వరి, బాలు విజయ కుమారి మధ్య ఇంటి దారి విషయంలో వివాదం తలెత్తింది. ఈ వివాదం ముదిరి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో విజయకుమారి భర్త బాలు మల్లికార్జున, మరో ఇద్దరు రాజేశ్వరిపై దాడి చేశారు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆమెను కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్ బాబు వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని మదనపల్లె పట్టణం శేషమహల్ ఏరియాకు చెందిన సందీప్ అనే యువకుడు శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని వన్‌టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. గుర్తించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డుకు ఎంపికైన వీఆర్‌డీఎస్ సంస్థ

వీరబల్లి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లుగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వీఆర్‌డీఎస్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సోమలరాజు శివరాజు పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని చిత్తూరు పట్టణంలోని విజయం ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు 150 మంది వివిధ విభాగాల్లో సేవలందించిన సేవా ప్రతినిధులకు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అందులో భాగంగా అన్నమయ్య జిల్లా నుంచి వీఆర్‌డీఎస్ సంస్థకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డు లభించింది. ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకునేందుకు వీఆర్‌డీఎస్ సంస్థ చేస్తున్న సేవలను గుర్తించి ఆ సంస్థ అధ్యక్షులు సురేంద్రారెడ్డిని ఇంపాక్ట్ నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సేవా ప్రతినిధులు, ఇంపాక్ట్ నేషనల్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సురేంద్రారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఓటర్లకు అనుకూలంగా
పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


మదనపల్లెటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఓటర్లకు అనుకూలంగా వుండేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్ (ఈఆర్‌వో) మేఘస్వరూప్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఏఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నివాస ప్రాంతాలకు 2 కి.మీ. పరిధిలోనే పోలింగ్ కేంద్రం వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా వున్న బీఎల్‌వో, బీఎల్‌ఏ స్థానాలను భర్తీ చేయాలన్నారు. ఓటరు కార్డులను ఆన్‌లైన్‌లో చెక్‌చేసి, తప్పులు, డబుల్ ఎంట్రీలు, ఫోటోలు మారి వుంటే సరిచేయాలని సూచించారు. సీపీఎం ప్రతినిధి శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలోని 98వ పోలింగ్ కేంద్రం నుంచి 145 పోలింగ్ కేంద్రం వరకు ఒకే ఇంటిలోని ఓటర్లను పలు పోలింగ్ కేంద్రాలకు కేటాయించారని, అలా కాకుండా ఒక ఇంట్లోని ఓటర్లను ఒకే పోలింగ్ కేంద్రంలో వుండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నిమ్మనపల్లె తహసీల్దార్ అమరనాథ్, డీఏవో రాఘవేంద్ర, టీపీవో జకీరాబేగం, రాజకీయపార్టీల ప్రతినిధులు బాలుస్వామి, రెడ్డిసాహెబ్, భగవాన్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

వక్ఫ్ సవరణ బిల్లును
కేంద్రం వెనక్కితీసుకోవాలి

● ముస్లింల డిమాండు ● మద్దతు పలికిన రాజకీయ పార్టీలు



సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ముస్లింలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా రూపొందించిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నమాజ్ అనంతరం పెద్ద సంఖ్యలో ముస్లింలు స్థానిక బెంగళూరు బస్టాండ్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఇందుకు కాంగ్రెస్, వైసీపీ, సీపీఐ, బాస్ నాయకులు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. వన్‌టౌన్ సీఐ ఎరిసావలి, టూటౌన్ సీఐ రామచంద్ర, తాలుకా సీఐ కళా వెంకటరమణ, తమ సిబ్బందితో ర్యాలీని ఆపడానికి ప్రయత్నించడంతో ముస్లింలకు, పోలీసులకు తోపులాట జరిగింది. ర్యాలీకి జెండాలు, డీజేల వాడకం నిషేధమని, కొందరు మాత్రమే వెళ్లి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించవచ్చని తెలిపారు. పట్టించుకోని ముస్లిం యువత బారికేడ్లను తొక్కుకుంటూ ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సబ్ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అర్ధగంట తరువాత ఆందోళన విరమించారు.

కార్యక్రమంలో బాస్ నేత పీటీఎం శివప్రసాద్, కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిషార్‌అహ్మద్, సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, భారతీయ సేన అధ్యక్షుడు శ్రీచందు, ముస్లింలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు

గురవయ్యపై వైసీపీ నేత కుమారుడు హత్యాయత్నం

వేముల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నేత వర్ర రవీంద్రనాథరెడ్డి కుమారుడు వర్ర హేమంత్‌కుమార్‌రెడ్డి తన కుమారుడు గురవయ్యపై హత్యాయత్నం చేసినట్లు షేక్షావలి తెలిపారు. షేక్షావలి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో గురవయ్య తుమ్మలపల్లెలోని తన నివాసం వద్ద ఉండగా కొండ్రెడ్డిపల్లె గ్రామానికి చెందిన వర్ర హేమంత్‌కుమార్‌రెడ్డి వచ్చి తాను వేముల కానిస్టేబుల్‌నని, నీ మీద ఫిర్యాదు వచ్చింది స్టేషన్‌కు రా అని బైక్‌పై తీసుకెళ్లి పులివెందుల-కడప ప్రధాన రహదారిలోని కుప్పగుట్టపల్లె వరకు బైకులో తీసుకెళ్లి మా నాయనను తిడతావా అంటూ బూతులు తిడుతూ రాడ్డుతో విచక్షణారహితంగా దాడి చేసినట్లు తన కుమారుడు తెలిపాడని షేక్షావలి పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న గురవయ్య భార్య మరికొందరితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించినట్లు షేక్షావలి తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చికిత్స పొందుతున్న గురవయ్య

ఆలస్యంగా నడిచిన నరసాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు

● మూడున్నర గంటలకుపైగా ఆలస్యంతో ప్రయాణికుల అవస్థలు



ములకలచెరువు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నరసాపూర్ నుంచి ములకలచెరువు మీదుగా ధర్మవరం జంక్షన్‌కు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం ఆలస్యంగా నడిచింది. మూడున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ జంక్షన్‌లో ఇంజన్ మొరాయించడంతో రైలు ఆలస్యంగా నడిచిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ములకలచెరువుకు ఉదయం 6.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 10.30 గంటలకు వచ్చింది. అలాగే పీలేరుకు ఉదయం 5.39 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 9.07 గంటలకు వచ్చింది. దీంతో ప్రయాణికులు గంటల తరబడిగా వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా మల్లిక



నియామక పత్రం అందుకుంటున్న మల్లిక

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జనసేన వీరమహిళ మల్లికను నియమించారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి పదవి ఇచ్చిన ఆర్.కృష్ణయ్య, జనసేన నాయకులు, వీరమహిళలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు దారం అనిత, టీడీపీ నేత బిల్లేరెడ్డిప్రసాద్, రమణ, రూప, సిద్దయ్య, కళ్యాణి, రేఖా, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి ఊరేగింపులో ఘర్షణ

● ఇరువురికి గాయాలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెన్నరాజుపోడు గ్రామంలో బుధవారం రాత్రి ప్రశాంతంగా శ్రీరామనవమి వేడుకలలో భాగంగా ఊరేగింపు జరుగుతుండగా పత్తి రాజేశ్వరి ఆమె భర్త సుబ్బరాయుడు తదితరులపై అదే గ్రామానికి చెందిన జోగినేని మణి (అలియాస్ చిన్న మణి) తన అనుచరులతో దాడి చేసినట్లు రాజేశ్వరి శుక్రవారం ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. పత్తి రాజేశ్వరి చెన్నరాజుపోడు గ్రామంలో నివాసముంటున్నారు. ఆమె భర్త సుబ్బరాయుడు కువైత్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతిలో ఓ వివాహం ఉన్న కారణంగా వచ్చిన సుబ్బరాయుడు చెన్నరాజుపోడులో కోదండరాముని ఊరేగింపును చూసుకునేందుకు చిన్నరాజుపోడుకు వచ్చారు. ఈ ఊరేగింపులో భార్యాభర్తలపై జోగినేని మణి దాడి చేశాడని తెలిపారు. దీంతో సుబ్బరాయుడు, రాజేశ్వరిలకు గాయాలయ్యాయని, కువైట్‌లో సెలవు లేనందున తిరుపతిలో వివాహం చూసుకుని తన భర్త కువైట్‌కు వెళ్లాడని బాధితురాలు తెలిపింది. ఈ మేరకు ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంఘటనపై విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.



ఫిర్యాదు చేయడానికి వచ్చిన రాజేశ్వరి

రెవెన్యూ అధికారులకు జరిమానా

కలికిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలో అనర్హులకు ఇళ్ల పట్టాలు జారీ చేశారన్న అభియోగాలపై ఇద్దరు రెవెన్యూ అధికారులకు జరిమానా విధిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా విచారణ చేపట్టిన కలెక్టరు 2018 ఆగస్టు 18న ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపారు. అప్పట్లో పులివెందుల తహసీల్దారుగా పనిచేసిన ఎల్.వి.ప్రసాద్ (ప్రస్తుతం రిటైరయ్యారు), ఏఆర్ఐ ఎ.సుజీత్‌కుమార్‌లను బాధ్యులుగా తేల్చారు. అనంతరం దీనిపై విచారణ జరపడానికి జాయింట్ కలెక్టరు-2ను నియమించారు. విచారణ అనంతరం 2020 మే 27 జాయింట్ కలెక్టర్-2 అక్రమాలపై ఇరువురినీ బాధ్యులుగా నిర్ధారిస్తూ నివేదికను ప్రభుత్వానికి పంపారు. అనర్హులకు పట్టాలివ్వడంలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి తహసీల్దారు ఎల్.వి.ప్రసాద్ నెలవారీ పింఛనులో 6 శాతం కోత, ఏఆర్ఐ సుజిత్‌కుమార్ ఒక వార్షిక పింఛను నిలుపుదల చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

డీఎల్డీవోగా వెంకటనారాయణ

కలికిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కడప డివిజన్ డీఎల్డీవోగా జి.వెంకటనారాయణను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈయన తిరుపతి తుడా కార్యదర్శిగా డెప్యుటేషన్‌లో పనిచేస్తుండగా కడప డీఎల్డీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్నాళ్లీ.. నిరీక్షణ

● రేషన్ కార్డుల కోసం ఎదురు చూపులు ● సచివాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు



పులివెందుల టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమందించే సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉండే రేషన్‌కార్డుల కోసం నిరుపేద కుటుంబాలు ఎదురు చూపులు చూస్తున్నారు. వైసీపీ అధి కారంలో ఉండగా పులివెందుల నియోజకవర్గం పరిధిలో తూతూ మంత్రంగా కొంత మందికే కార్డులు మంజూరు చేసింది. 2023 జూన్‌లో వివిధ సాంకేతిక సమస్యలు, ఇతర కారణాల చేత రేషన్ కార్డుల పంపిణీ సక్రమంగా సాగలేదు. దరఖాస్తు చేసుకున్న ఆరు నెల ల తరువాత కొత్తకార్డులు ఇస్తామని చెబుతూ కాలయాపన చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్‌కార్డు లేని ప్రజల్లో ఆశలు చిగురించాయి. అందుకనుగుణంగా కొత్త రేషన్‌కార్డుల జారీతో పాటు చేర్పులు మార్పులకు అవకాశమిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాఫ్ట్‌వేర్‌లో ఉత్పన్నమైన కొన్ని సమస్యలతో ఆ ప్రక్రియ చేపట్టడంలో జాప్యమవుతుంది. విషయం తెలియని ప్రజలు రేషన్‌కార్డుల కోసం మీసేవ కేంద్రాలు, సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు.

2023 నుంచి నూతనంగా వివాహాలు జరుపుకున్నవారు తప్పు ఒప్పులు, మార్పులు చేర్పులు, నూతనగా కార్డులు పొందాల్సిన వారు ఇలా ఎంతో మంది రేషన్‌కార్డులు లేక తంటాలు పడుతు న్నారు. అలాగే రేషన్‌కార్డు లేక సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం అవస్థలు పడుతున్న వారు కూడా కోకొల్లలుగా ఉన్నారు. అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు రేషనుకార్డే ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్తవి కోరుతూ మండ లం, ఆర్డీవో, జిల్లా స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి రేషన్‌కార్డులు చేర్పు లు మార్పులకు అవకాశం లేకపోవడంతో ఇప్పుడు అటు తహసీల్దరు, ఇటు పౌరసరఫరాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందని, త్వరలో ప్రకటన వస్తుం దని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం సమ స్యను గుర్తించి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా

సుమారు ఐదేళ్ల క్రితం వివాహం అయింది. నాకు ఇద్దరు పిల్లలు సంతానం. రోజువారి కూలీతో నా భర్త కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రేషన్‌కార్డు కోసం అన్ని చోట్ల తిరుగుతున్నాం. కార్డు మంజూరు కాలేదు. సంక్షేమ పథకాలు అందడం లేదు. అధికారులు రేషన్‌కార్డు మంజూరు చేసి ఆదుకోవాలి.

- మమత, పులివెందుల

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం.

నాకు నాలుగేళ్ల కిందట వివాహమైంది, ప్రస్తుతం ఇద్దరు పిల్లలు. రోజూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. రేషన్‌కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. అత్యవసర వైద్యసేవలు పొందాలన్నా ఆరోగ్యశ్రీ లేదు. అధికారులు తమ గోడు పట్టించుకుని రేషన్‌కార్డు మంజూరు చేయాలి.

- వెంకటలక్షుమ్మ, పులివెందుల

సైట్ ఓపెన్ కాగానే కార్డులు మంజూరు చేస్తాం



రేషన్‌కార్డుల సమస్య ఉన్నది వాస్తవమే. ప్రస్తుతం నివేశన స్థలాలకు సంబంధించిన లాగిన్ అందుబాటులోకి వచ్చింది. అయితే రేషన్‌కార్డులకు సంబంధించిన సైట్ ఓపెన్ కావడం లేదు. కార్డులకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తాం. ఈ క్రమంలో అప్‌డేట్ జరగ్గానే అర్హులను గుర్తించి రేషన్‌కార్డులు మంజూరు చేస్తాం.

- చిన్నయ్య, ఆర్డీవో, పులివెందుల

క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపిక



క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వైవీయూ క్యాంపస్ డ్రైవ్‌లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వైవీయూ ఎంబీఏ శాఖ అధిపతి డాక్టర్ పి.సరిత ఆధ్వర్యంలో రిలయన్స్ రిటైల్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఏటా రూ.2.75 లక్షల వేతనం, పీఎఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి పలు సౌకర్యాలను సంస్థ కలిస్తుందని రిలయన్స్ లిమిటెడ్ మేనేజర్ భానుప్రకాష్ తెలిపారు. డీన్ వై.సుబ్బరాయుడు ఉద్యోగాలు పొందిన వారిని అభినందించారు. బీవోఎస్ చైర్మన్ డాక్టర్ బి.గంగయ్య మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంబీఏ శాఖ అధిపతి డా క్టర్ పి.సరిత మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ ఎంపికలకు రావడం పట్ల హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ కె.సుమన్, ఎన్.మాధవి, ఎంబీఏ సహ ఆచార్యులు డాక్టర్ వరప్రభాకర్, అధ్యాపకులు పి.రాజశేఖర్, అనిల్ దేవకుమార్, సుధీర్‌కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన వెంకటరాముడు

సింహాద్రిపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు-బలపనూరు గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ వెంకటరాముడు (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... మృతుడు వెంకటరాముడు అనంతపురం జిల్లా యాడికి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందినవాడు. వెంకటరాముడు కూలి పనులు చేసుకుని తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో పులివెందులలో అరటి గెలలు కోత పనులు చేస్తూ శుక్రవారం పులివెందుల నుంచి తన స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

బాలల సంక్షేమ సమితిలో ఇద్దరు చిన్నారులు

కడప ఎన్జీఆర్ సర్కిల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని పిల్లలను ఐసీడీఎస్ అధికారులు బాలల సంక్షేమ సమితిలో ఉంచారు. ఐసీడీఎస్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మాస్టర్ సాకేత్ (మూడేళ్లు), మల్లి (రెండేళ్లు) అనే ఇద్దరు పిల్లలు కడప రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్నారని సమాచారం అందిందన్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్, మహిళా పోలీస్ వెళ్లి ఆ ఇద్దరు పిల్లలను తీసుకొని కడపలోని బాలలసంక్షేమ సమితికి అప్పగించినట్లు చెప్పారు. ప్రస్తుతం సాకేత్, మల్లి మగపిల్లలు. ప్రత్యేక దత్తత సంస్థ, జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ కడపలో ఉంచినట్లు చెప్పారు. ఆ పిల్లల తల్లిదండ్రులు కానీ ఇతర కుటుంబ సభ్యులు ఎవరైన ఉంటే బాలల సంక్షేమ సమితి కడప వారిని సంప్రదించాలని కోరారు.

35 బస్తాల బియ్యం స్వాధీనం

దువ్వూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరులో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరు సీఎస్‌డీటీ మల్లికార్జున, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సంయుక్త దాడిలో సుమారు రూ.80,500 విలువ గల 35 బస్తాలు స్వాధీనం చేసుకుని సుబ్రమణ్యం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పంచనామా ద్వారా దువ్వూరు పోలీసులకు నిందితుడిని అప్పగించారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు.

రేషన్ దుకాణం సీజ్

బద్వేలుటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని గోపవరం మండలం శీలంవారిపల్లెలోని చౌకదుకాణాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 4897 కేజీల రేషన్ బియ్యం, 128 కేజీల చక్కెర తక్కువ ఉండటంతో షాపును సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గీతా ప్రసాద్ రెడ్డి, ఏడీఐ లక్ష్మీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్జీఆర్ సర్కిల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన అర్హులైన యువకులు స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 828 యూనిట్లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. 34.40 కోట్ల రుణాలు అందజేయడం జరుగుతుందని, రూ.13.57కోట్లు సబ్సిడీ,రూ.1.72కోట్ల లబ్ధిదారు వాటా, రూ.19.12కోట్లు బ్యాంకు రుణం ఉంటుందని వివరించారు. అర్హులైన కులాలకు చెందిన వారు ఈనెల 14 నుంచి వచ్చే నెల 10వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు.

చిన్నారుల ఉసురు తీసిన నీటికుంట



యశ్వంత్, విజయ్, చొక్కరాజు దేవాన్ష్‌ల మృతదేహాలు

చిట్వేలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆ చిన్నారులంతా బంధువులు. సరదాగా ఆడుకోవడానికి నీటికుంట వద్దకు వెళ్లి ఆ కుంటలోనే మునిగి ముగ్గురు అసువులు బాశారు. ఈ విషాదకర సంఘటన చిట్వేలి మండలంలో శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎం.రాచపల్లెలో శుక్రవారం సాయంత్రం గ్రామానికి సమీపంలో ఉన్న నీటికుంటలో చొక్కరాజు దేవాన్ష్ (5), చొక్కరాజు విజయ్ (4), రెడ్డిచర్ల యశ్వంత్ (5) ముగ్గురు చిన్నారులు కుంటలోకి దిగి ఆడుకోవడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు అందులో ఉన్న నీటిలో పడి మృతి చెందారు. చిన్నారుల ఆచూకీ కోసం వెతుకుతుండగా కుంటలో విగత జీవులుగా పడి ఉన్న ముగ్గురు చిన్నారులను గ్రామస్థులు హుటాహుటిన చిట్వేలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో గ్రామం అంతా శోకసంద్రంలో మునిగిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. తహసీల్దార్ మురళీకృష్ణ, వీఆర్వో భుజంగరావు, వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

వంటగ్యాస్ సిలిండర్లకు వర్ధంతి : తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.50 పెంచిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యాస్ సిలిండర్లకు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లకు పూలమాల వేసి నిరసన తెలిపారు. తులసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో 2014లో గ్యాస్ సిలిండర్ ధర రూ.410 ఉండేదని, బీజేపీ పాలనలో పలుమార్లు ధర పెంచి రూ.853 చేశారని తెలిపారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై అనుచత వ్యాఖ్యలు చేసిన టీడీపీకి చెందిన చేబ్రోలు కిరణ్‌పై కేసు పెట్టి అరెస్టు చేయడం, పార్టీ నుంచి సస్పెండ్ చేయడం శుపరిణామమని తులసిరెడ్డి అన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలి

● వైస్ చాన్సలర్ సుదర్శనరావు



జేఎన్టీయూ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు, హాజరైన విద్యార్థులు

పులివెందుల రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నేర్చుకునే విద్యతో తాము ఉద్యోగాలు సాధించడం కాదు ఉద్యోగ అవకాశాలు కల్పించేస్థాయికి చేరుకోవాలని అనంతపురం జేఎన్టీయూ వైస్ చాన్సిలర్ ఆచార్య హెచ్.సుదర్శనరావు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పులివెందుల జేఎన్టీయూ కళాశాల వార్షికోత్సవం నిర్వహించగా ముఖ్యఅతిథిగా వీసీ హాజరయ్యారు. ముందుగా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్టు విషయాల మీదనే కాక సాంకేతిక నైపుణ్యత,విలువలు, విద్య సృజనాత్మకతతో కళాశాల యూనివర్సిటీని రాష్ట్ర, దేశస్థాయిలో, వివిధ రంగాలలో నైపుణ్యాభివృద్ధిని సంపాదించి కళాశాలను అగ్రస్థానంలో ఉంచాలని వివరించారు. అభ్యసన అవగాహన, నైపుణ్యాభివృద్ధి గోల్ సెట్టింగ్, అకడమిక్ క్రెడిట్ డిపాజిట్ స్కీం,మల్టీ డిసిప్లినరీ, ఇంటర్ డిసిప్లినరీ,సాంకేతికత, వాల్యూ ఆడెడ్‌కోర్సులపై సవివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్యకె.శేషమహేశ్వరమ్మ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన

కడప (వినాయకనగర్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో డీడీయూ-జీకేవై పథకం కింద సిడాప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా 18 నుండి 32 సంవత్సరాల వయస్సు గల గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ ఎన్.సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. అందుబాటులో ఉన్న శిక్షణ కోర్సులు ఎలక్ట్రానిక్స్ రంగంలో ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్, హెల్త్‌కేర్ సెక్టార్ రంగంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, సెక్టార్ రంగంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్బ్యూటీ అండ్ వెల్నెస్ సెక్టార్ రంగంలో బ్యూటీ థెరపీ, శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వం గుర్తించిన సర్టిఫికెట్, ప్రాక్టికల్ శిక్షణ, సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అవకాశాన్ని గ్రామీణ యువత వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాకు ఫోన్ నెంబర్లు 9063082227, 9966448807లను సంప్రదించాలని కోరారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు : కలెక్టర్ శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా జిల్లాలో నీటి ఎద్దడి నివారించడానికి తాత్కాలిక ప్రణాళిక ద్వారా అవసరమైన గ్రామాల్లో నీటి రవాణాకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా, పీఆర్, ఎస్సీ కార్పొరేషన్, జీఎస్‌డబ్ల్యుఎస్, పంచాయతీ తదితర శాఖలకు సంబంధించి జిల్లా అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ఎక్కడా కూడా మనుషులకు, పశువులకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు గ్రామాల్లో, మండలాల్లో, మున్సిపాలిటీల్లో ఉన్న నీటి సరఫరా వనరులు, బోర్లు సక్రమంగా పనిచేసేలా తగు పర్యవేక్షణ చేయాలన్నారు. నీటి సరఫరా అవసరమైన గ్రామాలకు తాత్కాలిక ప్రణాళిక కింద వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. రవాణాకు సంబంధించి యాప్ ద్వారానే బిల్లుల చెల్లింపులు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో ప్రధాన కూడళ్ల, ప్రతి సచివాలయాల ప్రాంతంలో వెంటనే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాయితీతో కూడిన రుణాల మంజూరుకు జిల్లాకు 563 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 14 నుంచి మే 10వ తేదీ వరకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్, మండల స్థాయిల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఉపాధి హామీ నిధులతో జిల్లాలో పదివేల ఎకరాల్లో గడ్డి పెంపకం చేపట్టాలని, ప్రతి నియోజకవర్గంలో 1500 ఎకరాలు, ప్రతి మండలంలో 500 ఎకరాల్లో తప్పనిసరిగా గడ్డి పెంపకం చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాకు 1000 పశువుల నీటి తొట్టెల నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటికే 176 నీటితొట్టెలను పూర్తి చేయగా మిగిలినవి ప్రగతిలో ఉన్నాయని, ఈనెల 14లోగా వాటిని పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యుఎస్, పీఆర్ ఎస్ఈలు ప్రసన్నకుమార్, దయాకర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, ఇన్‌చార్జి డీపీవో, ఎంపీడీవోలు, మండల అధికారులు పాల్గొన్నారు.

శాంతి మార్గంలో నడవాలి

కడప కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశ క్షేమం, ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలని పాస్టర్ పి.మహేశ్ కోరారు. శుక్రవారం నగర 48వ డివిజన్ కృపాకాలనీ చర్చిలో దేశ క్షేమం కోసం ప్రత్యేకంగా ఉపవాస ప్రార్థన కూడిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సువార్తను విని శాంతిమార్గంలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ శాంతమ్మ, సేవకులు రవితేజ, అబ్రహం, విశ్వాసులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా పూలే జయంతి వేడుకలు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక విప్లవ రథ సారధి జ్యోతిరావుపూలే అని పలు రాజకీయ, బీసీసంఘాల, ప్రజాసంఘ నాయకులు కొనియాడారు. జ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పాతబస్టాండు వద్ద గల పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కాగా బీసీ మహాసభ ఆధ్వర్యంలో రాష్ట్ర కన్వీనరు అవ్వారు మల్లిఖార్జున, జిల్లా రజకుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రజకుల ఐక్యవేదిక అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, బీసీ బడుగు, బలహీన వర్గాల సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టిబోయిన సుబ్బ రాయుడు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు, టీడీపీ తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడక చక్రధర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాతబస్టాండు వద్ద గల పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాలుల ర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగ మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంటు గోవిందు నాగరాజు పాల్గొన్నారు. అదే విధంగా మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, నగర మేయరు కె.సురేశ్‌బాబు పూలమాల వేసి నివాళుర్పించారు. అలాగే బీసీ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాసా కోదండరామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా జనసేన నాయకులు సుంకర శ్రీనివాస్, జీవీ రమణ శుక్రవారం పాత బస్టాండులో గల మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమల వేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు.

కడప(వినాయకనగర్)..: పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పాత బస్టాండు లోని ఆయన విగ్రహానికి ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా నివాళులర్పించారు.కాగా దళితమిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కైపు రామాంజ నేయులు, జిల్లా కన్వీనర్ బాబు, కొమ్ము శ్రీనివాసులు నివాళులర్పించారు.

కడప కలెక్టరేట్..: జ్యోతి రావు పూలే నేటి తరానికి ఆదర్శనీయుడని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, కడప కో-ఆర్డినేటర్ బండి జకరయ్య కొనియాడారు. శుక్రవారం ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని పూలే విగ్రహానికి, జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలోని పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అలీఖాన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుమంత కుమార్, అబ్దుల సత్తార్,గౌస్‌పీర్,° ఎ.డి.సంజయ్ కాంత,రఫీక్‌ఖాన్, మామిళ్ల బాబు శ్యామలమ్మ, సిరాజుద్దీన్‌ఉన్నారు.

కడప ఎడ్యుకేషన్..: ఆధునిక సమారూపకర్త పూలే అని యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పూలే జయంతినియోగి వేమన విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఓబీసీ సెల్ అధ్యక్షులు ఆచార్య కేఎస్వీ కృష్ణారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాస రావు, ప్రధాన ఆచార్యుడు ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ సిబ్బంది నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓఈసీ సెల్ సభ్యులు డాక్టర్ జి.పార్వతి, డాక్టర్ బి.గంగయ్య సరళ, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వైస్ చాన్సలర్ శ్రీనివాసరావు, పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైసీపీ నేతలు



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న అమీర్‌బాబు, అవ్వారు మల్లికార్జున



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జనసేన నేతలు

టీడీపీ నేతల నివాళులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పూలే జయంతిని పురస్కరించుకుని నగర పాతబస్టాండు వద్ద గల పూలే విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, గోవర్ధనరెడ్డి, టీడీపీ బీసీ నాయకుడు యాటగిరి రాంప్రసాద్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కొళాయిల్లో మురికినీరు



వేంపల్లె,ఏప్రిల్ 11 (ఆంధ్ర జ్యోతి): వేంపల్లె పంచాయతీ పరిధిలో గండి రోడ్డు నుంచి కాలేజీ రోడ్డుకు వెళ్లే శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో నాలుగు రోజులుగా కొళాయిలకు మురికినీరు వస్తోంది. కొళాయిల నుంచి వచ్చే నీరు దుర్గంధంగాను నల్లరంగులో వస్తున్నాయి. నీళ్లు పట్టుకున్న వెంటనే దుర్వాసన వస్తోంది. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించాలి. లేకుంటే ప్రజలు నీటికి ఇబ్బందిపడడం, వాడితే రోగాల బారిన పడడం ఖాయం.

పన్నులు వసూలు చేయండి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో పెండింగులో ఉన్న పన్నులను త్వరగా వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాముడు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ కార్యదర్శులు , నోడల్ అధికారులతో పన్ను వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను,ఖాళీ స్థలం పన్ను బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వడ్డీ మాఫీ చేసిందన్నారు. బకాయి ఉన్న గృహ యజమానులందరూ 30వతేదీలోగా పన్నులు చెల్లించాలని కోరారు.

వైభవంగా అయ్యప్పస్వామి జయంతి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోతి సమాధి సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి జన్మ దినోత్సవం సందర్భంగా ఆలయ నిర్వాహకుడు, గురుస్వామి వెంకట్రామిరెడ్డి అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 5గంటల నుంచి పంచామృతాభిషేకంతో పాటు తోమాల అలంకరణ, విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు భజన నిర్వహించారు. భక్తులకు అల్పాహారం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపురం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):కమలాపురం పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రెండో శనివారం సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ చాంద్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా శనివారం మండలంలోని కోగటం,పందిళ్లపల్లె, చిన్నచెప్పలి, లేటపల్లె, సముద్రంపల్లె సబ్‌స్టేషన్లలో కూడా మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. అలాగే నగర పంచాయతీలోని మారుతీనగర్, వికలాంగులకాలనీ, గండ్లూరు కాలనీ, బీడీకాలనీలో ఉదయం 9 నుంచి 12 వరకు అంతరాయం ఉంటుందన్నారు.

సంక్షేమ ఫలాలు అందించాలి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు మెరుగైన సంక్షేమ ఫలాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే రాధాక్రిష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయం వద్ద పెండింగులో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, రవికుమార్,దయాకర్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం

పులివెందుల రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం సాగుతుందని ఎన్‌ఎంయూఏ రాష్టనాయకులు పి.ఎస్.ఎన్.రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏపీఎస్‌ఆర్‌టీసీ వద్ద ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ జోనల్ నాయకులు రామలింగారెడ్డి, రీజనల్ కమిటీ నాయకులు ఈశ్వరయ్య, డిపో అధ్యక్షుడు సీపీరెడ్డి, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎం.రెడ్డి, డిపో సెక్రటరీ ఆర్‌కే రెడ్డి, డిపో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కడప మారుతీనగర్..: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారంఆర్టీసీ బస్టాండు వద్ద ఎన్‌ఎంయూ కడప డిపో ఆధ్వర్యంలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో ఎన్‌ఎంయూ వైస్ ప్రెసిడెంట్ ఖాన్, కోశాధికారి బాషా, సెక్రటరీ మహాలక్ష్మి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

వేంపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఏఓ రవి కుమార్ పర్యవేక్షణలో అట్టడుగు వర్గాలను ఉద్ధరించడంలో విద్య యొక్క పాత్ర - అప్పుడు,ఇపుడు అనే అంశంపై పోటీలు నిర్వహించారు. అంబేడ్కర్ జయంతి రోజున బహుమతులు అందిస్తామని ఏఓ తెలిపారు.

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న ముస్లింలు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మత పెద్దలు, ముస్లిం మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సెవెన్‌రోడ్స్ సర్కిల్ వద్ద వక్ఫ్‌బోర్డుయాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన తెలిపారు. కాగా ఆదివారం కడపలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీసీఎం అంజ ద్‌బాషా, నజీర్ అహ్మద్, సుభాన్‌బాషా, సలావుద్దీన్, మత గురువులు అహ్మద్‌పీర్ షామీరి, ముఫ్తిగౌస్, మహ్మద్‌ఆలీ, బుద్దాది, ముఫ్తి రహీముల్లాఖాన్, పెద్దఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న గురప్ప

కడప మారుతీనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ జనాభా 52 శాతంగా తేల్చిన కూట మి ప్రభుత్వం కులగణన లెక్కల ప్రకారం బీసీలకు విద్య ఉద్యోగ, ఉపాధి రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు సగిలి గురప్ప డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాల కలెక్టరేట్ వద్ద బీసీ సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం కడప కలెక్టరేట్ ఎదుట జిల్లా బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీ సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ, బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యదర్శి బీసీ రమణ, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు ఓబయ్య, జిల్లా ఇన్‌చార్జి జయరాం, ఉపాధ్యక్షుడు బాలచంద్ర, మహిళా అధ్యక్షురాలు బేబీ, నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలను చేర్పిద్దాం

చెన్నూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వీరనారాయణ, వీరశేఖర్, లక్ష్మయ్య, వెంకట ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన నేతలకు ఘన స్వాగతం



జనసేన నాయకులకు స్వాగతం పలుకుతున్న తుంగా రమణయ్య

కడప సెవెన్ రోడ్స్ ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జనసేననాయకులు, సివిల్ సప్లయీస్ చైర్మన్ తోట సుధీర్, జనసేన నాయకుడు రత్నంనకు శుక్రవారం జిల్లాకు వచ్చిన వారికి జనసేన జిల్లా నాయకుడు తుంగా రమణయ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తుంగారమణయ్య మాట్లాడుతూ ఒంటిమిట్ట కోండరామస్వామి కల్యాణానికి విచ్చేసిన జనసేన నాయకులకు స్వాగతంపలికానన్నారు. భవిష్యత్తులో కూటమి ప్రభుత్వమైన బీజేపీ, టీడీపీ, జనసేనపార్టీల కలయికతో ముందుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటసుమన్, తిరుమలశెట్టి సిద్దార్థ, ఉప్పు గణేష్, శివ తదితరులుపాల్గొన్నారు.

దేవదాయ శాఖ మంత్రికి సత్కారం



చక్రాయపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి సత్కరించారు. శుక్రవారం బద్వేలులో ఉన్నమంత్రిని గండి క్షేత్రం ఆలయ అసిస్టెంట్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ప్రధాన అర్చకుడుకేసర, ఆలయ మాజీచైర్మన్ వెంకటస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ అర్చకులు ఆయనను శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వాదం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పునఃనిర్మాణం కోసం అదనంగా రూ.10కోట్లు నిధులుమంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్ ప్రారంభం



కమలాపురం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అందరికీ శుద్ధి జలాలు అందించాలన్న ఉద్దేశ్యంతో వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం మూడురోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్‌ప్లాంటును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, రాఘవరెడ్డి, ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, దాదిరామయ్య, జంపాల నరసింహారెడ్డి, గోపాల్‌యాదవ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డబ్బులు కట్టాం పైపులెప్పుడిస్తారు..?

మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

పులివెందుల రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీతో పైపులు అందిస్తాం డబ్బులు కట్టండి అంటే రూ.10వేల చొప్పున కట్టాం, ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు పైపులు ఇవ్వలేదంటూ పలువురు ప్రజాప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం మెరుగుకోసం సమష్టిగా ముందుకెళ్తున్నామన్నారు. కాగా 2023లో నియోజకవర్గ వ్యాప్తంగా వేల మంది డబ్బులు కట్టారన్నారు. ఇంత వరకు పైపులుఇవ్వలేదు, డబ్బులు ఇవ్వలేదన్నారు. దీనిపైన సరైన సమాధానం చెప్పాలంటూ పలువురు ప్రజాప్రతినిధులు బైఠాయించారు. కాగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నట్లు ఏఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రామానాయుడు, ఏపీఓ పుష్పలత,ఏపీఎం గురురాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్నీ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం కావాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా మనమంతా పనిచేయాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆకాంక్షించారు. శుక్రవారం వైవీయు వీసీ శ్రీనివాసరావు శాఖల వారీగా సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి వెంట ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి ఉన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఉరుసు మహోత్సవం



ఊరేగింపుగా వస్తున్న దర్గా పీఠాధిపతి సోదరులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన ఏ గఫారియా, ఖాదరియా ఉరుసు మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. దర్గా పీఠాధిపతి (ముతవల్లి), సజ్జాద్ ఏ నషీన్ మహ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గంధం ఇంటి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో నష్యాన్ జెండాను ఊరేగింపుగా తీసుకువచ్చారు. జెండా ఊరేగింపు తాళిం, మార్కెట్, చౌక్ సెంటరు మీదుగా పెద్దదర్గాకు చేరుకుంది. ఊరేగింపులో ప్రత్యేక డప్పు కళాకారుల వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేశారు. తమిళనాడు నుంచి ప్రత్యేకంగా తెచ్చిన బాణసంచా పెద్దఎత్తున పేలుస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నషాన్ జెండాను దర్గా ఆవరణలో ఆవిష్కరించారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనం సమక్షంలో హజ్రత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రీ, దస్తగిరిషా ఖాద్రీ, మౌలానా మౌల్వీ మొహిద్దీన్‌షా ఖాద్రీ, హాజీ హజరత్ జహీరుద్దీన్ షాఖాద్రీ మజార్లపై పూలచాదర్లు సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరిషా ఖాద్రీ, మౌలాన ఖాద్రీ, గౌస్‌పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. రాత్రి టిహాస్సేన్ మియా కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కాగా శనివారం రాత్రి గంధం మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి గొప్ప ఖవ్వాలి పోటీ నిర్వహించనున్నారు.

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన రితేష్‌కుమార్‌రెడ్డి



బద్వేలుటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బద్వేలు టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులతో కడప ఎయిర్‌పోర్టుకు చేరుకోగా స్వాగతం పలికారు.

క్యాంప్‌బెల్‌లో సంబరాలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): క్యాంప్‌బెల్ వైద్యశాలలో శుక్రవారం డాక్టర్ అగస్టిన్‌రాజు ఆయన నివాసానికి చేరుకోవడంతో సిబ్బంది సంబరాలు జరుపుకున్నారు. అయితే వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ రవీంద్ర లేక అగస్టిన్ రాజు అనే సందేహం ప్రజలను వేధిస్తున్న ప్రశ్నగా మిగిలింది.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి



మోహన్
ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ

జమ్మలమడుగు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నీటి అవసరాలు పెరిగాయని కావున ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని జమ్మలమడుగు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ మోహన్ తెలిపారు. వేసవి కావడంతో ఎక్కడైనా నీటి సమస్య తలెత్తినా తమ సిబ్బందితో వెంటనే ఆ ప్రాంతాలకు వెళ్లి చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరిస్తామని 'ఆంధ్రజ్యోతి' ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: నియోజకవర్గంలో ఎన్ని మండలాలకు ఎన్ని గ్రామాలు ఉన్నాయి?

జవాబు: జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం ఆరు మండలాల్లో మొత్తం 194 గ్రామాలు ఉన్నాయి.

ప్రశ్న: నీటి పథకాలు ఎన్ని ఉన్నాయి.?

జవాబు: నియోజకవర్గంలో సీపీడబ్ల్యూఎస్ స్కీం, జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణలో ఉంది. పీడబ్ల్యూఎస్ స్కీం గ్రామ పంచాయతీ పరిధిలో, హ్యాండ్‌బోర్స్ (చేతి పంపులు)స్కీం మండల పరిషత్ ఆధ్వర్యంలో ఉంది.

ప్రశ్న: నీటి సమస్య ఉంటే ఎవరికి తెలియజేయాలి.?

జవాబు: నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా మంచి నీటి సమస్యలు ఏర్పడితే ముందుగా జమ్మలమడుగు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి 9441210370, 9490108292 ఫోన్ చేసి సమస్యలు తెలుపవచ్చు.

ప్రశ్న: ప్రస్తుతం ఏయే గ్రామాల్లో సమస్యలున్నాయి?

జవాబు: జమ్మలమడుగులో గండికోట, చిటిమిటిచింతల, గండికోట కొట్టాలపల్లి గ్రామాల్లో మంచినీటి సమస్యలు మే మాసంలో బోర్లు అడుగంటి ఏర్పడే అవకాశం ఉంది.

దర్జాగా చెరువుల ఆక్రమణ

● ఆందోళనలో ఆయకట్టుదారులు ● పట్టించుకోని అధికారులు ● ఇలా అయితే సాగు, తాగునీటికి ఇక్కట్లు తప్పవంటున్న ప్రజలు



వరి పైరు పూర్తికాగా మిగిలిన గెనలు

చెరువుకు ఏర్పాటు చేసిన అలుగు

చాపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చెరువును చెరపడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దీంతో చెరువు కింద ఆయకట్టుదారులు సాగునీరు అందక ఆందోళన చెందుతున్నారు. ఇలా అయితే సాగు, తాగునీటికి ఇక్కట్లు తప్పవంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాపాడు మండలంలోని నాగులపల్లె, ఖాదర్‌పల్లె, పల్లవోలు, గ్రామాల వద్ద ఉన్న ప్రభుత్వ భూములను కొందరు దర్జాగా ఆక్రమించుకున్నారు. గత కొన్ని రోజుల నుంచి వారు వరి పంటను సాగు చేస్తున్నారు. సర్వే నంబరు 394లో ఖాదర్‌పల్లె, నాగుపల్లె చెరువులు 228 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్నాయి. పల్లవోలు చెరువు 75 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఈ మూడు చెరువుల పరిధిలో రైతులు సుమారు 70 ఎకరాలు ఆక్రమించుకున్నారు. చాపాడు చానెల్‌కు సాగునీరు రాగానే రైతులు వరి పంటను సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్‌లో సుమారు 4 నెలలపాటు చెరువుల్లో పంట సాగు చేస్తున్నారు. నాగులపల్లె చెరువుకు ఒకవైపు హద్దులు కనపరిచే కట్టను కూడా తొలగించి గత పదేళ్ల నుంచి కొందరు పంటలు సాగు చేస్తున్నప్పటికి రెవెన్యూ అధికారులు కానీ, చాపాడు చానెల్ అధికారులు కానీ పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. కొంతమంది రాజకీయ నాయకుల బంధువులు చెరువును ఆక్రమించుకున్నారని అందువల్ల ప్రజాప్రతినిధులు అండదండలు ఉండడంతో అధికారులు మిన్నకుండిపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. చాపాడు చానెల్ నుంచి వచ్చే సాగునీటితో ఈ మూడు చెరువులు నింపుతారు ఒకసారి నింపితే సుమారు ఏడు నెలలవరకు నీరు నిలువ ఉంటాయి. రైతులు పంటలు సాగు చేసుకోవచ్చు. నాగులపల్లె, ఖాదర్‌పల్లె చెరువుల పరిధిలో సుమారు మూడు వేల ఎకరాలు పల్లవోలు చెరువు పరిధిలో 1200 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ప్రతి ఏడాది రైతులు వరి పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ మూడు చెరువులు నాగులపల్లె, ఖాదర్‌పల్లె, పల్లవోలు, తిమ్మాయపల్లె ఇంకా పలు గ్రామాల పరిధిలోని రైతులకు జీవనోపాధి కలిగిస్తున్నాయి. ఖాదర్‌పల్లె గ్రామంలో కొంతమంది రైతులు చెరువు ఆక్రమణలపై కలెక్టర్‌కు, తహసీల్దారుకు ఫిర్యాదులు చేసినప్పటికి ఏ ఒక్క అధికారి కూడా చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. చెరువులతోనే ఆ గ్రామాల ప్రజలకు తాగునీరు లభిస్తుంది. సంబందిత అధికారులు ఇప్పటికైనా ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చాపాడు చానెల్ ఏఈ ఏమన్నారంటే: చెరువుల ఆక్రమణలపై చాపాడు చానెల్ ఏఈ గురుమోహన్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరుగా చెరువు ఆక్రమణలకు గురైన విషయం వాస్తవమేనన్నారు. అయితే చెరువుల ఆక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు జారీ చేసి వాటిని తొలగిస్తామన్నారు.

ముక్తిరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున స్వామివారికి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం 4 గంటలకు పుట్టమన్ను తీసుకువచ్చి బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవం పురష్కరించుకుని ధ్వజారోహణం చేశారు. రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. శనివారం రాత్రి 7 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో శ్రీధర్ తెలిపారు.

నేడు ఓబన్నపేటలో సీతారాముల కల్యాణం

కొండాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబన్నపేట లోని రామాలయంలో శనివారం ఉదయం సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు.

అంధకారంలో రెండు గ్రామాలు

కాశినాయన ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పిట్టిగుంట, చెన్నారెడ్డిపల్లె గ్రామాల్లో గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అంధకారంలో ఉండిపోయారు. చిన్నపాటి వర్షానికి రాత్రంతా కరెంట్ సరఫరా లేకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈరెండు పల్లెల్లో ఆర్డీఎస్ఎస్ లైన్‌లు ఏర్పాటు సగం వరకు చేసివదిలి వేయడంతో ఇలాంటి పరిస్థితి తలెత్తిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఓవైపు సగం గ్రామానికి కరెంట్ ఉండడం మరోవైపు సగం గ్రామానికి కరెంట్ లేకపోవడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ఈమధ్యకాలంలో రెండు మూడు సార్లు ఏర్పడిందన్నారు. రాత్రుల్లో కరెంట్ సమస్య ఏర్పడితే పట్టించుకొనే నాథుడే ఉండటంలేదన్నారు. అధికారులు స్పదించి ఆర్డీఎస్ఎస్ లైన్‌లను పూర్తిచేసి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రాజుపాలెం మండలం వాసుదేవ పురం ఎస్సీకాలనీ ఏరియాలోని ఒక రేకుల షెడ్డులో అక్రమం గా నిల్వ ఉంచిన 35 బస్తాల రేషన్ బియ్యం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం సా యంత్రం దాడి చేసి ఇందులో 35 ప్లాస్టిక్ బస్తాలలో అక్రమంగా ఉంచిన దాదాపు 16.45 క్వింటాళ్ల బియ్యం గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ షెడ్డులో ఎవరు నిల్వ ఉంచా రనే దానిపై ఆరా తీస్తున్నారు. ఈ దాడుల్లో విజిలెన్సు సీఐ శివన్న ఏవో బాలగంగాధర్ రెడ్డి, ప్రొద్దుటూరు సివిల్‌సప్లయ్ ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ మల్లికార్జున వీఆర్వో, విజిలెన్సు కానిస్టేబుళ్లపాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి జలాభిషేకం

ఖాజీపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి క్షేత్రం సమీపానగల పెన్నానదిలో అయ్యప్పస్వామికి ఘనంగా జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పత్తి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఖాజీపేట అయ్యప్పస్వామి గుడి నుంచి పుష్పగిరి క్షేత్రం వరకు ఊరేగింపుగా స్వామివారిని తీసుకెళ్లి అక్కడ జలాభిషేకంనిర్వహించామన్నారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : రెండు బైకులు ఢీకొని ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. మైదుకూరు, ప్రొద్దుటూరు నుంచి వస్తున్న బైకులు రెండు ఒకదానికొకటి ఢీ కొని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

భారతీయ పెళ్లి సంప్రదాయలు చాలా గొప్పవి

● పోట్లదుర్తి పెళ్లిలో వధువు విదేశీ స్నేహితుల సందడి



నూతన వధూవరులతో విదేశీ మిత్రులు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భారతీయ పెళ్లి సంప్రదాయాలు ఎంతో గొప్పవని, ప్రతి ఒక్కరు ఆచరించే రీతిలో ఉన్నాయని తమకు ఎంతగానో నచ్చాయని రష్యా, థాయిలాండ్,జర్మనీ, ఆస్ట్రేలియాకు చెందిన వారు పేర్కొన్నారు. పోట్లదుర్తికి చెందిన వెంకటలక్షుమ్మ, ప్రతాప్ నాయుడుల కుమార్తె ప్రవల్లిక వివాహం వంశీతో జరిగింది. ఉద్యోగం చేసే చోట పరిచయమైన ప్రవల్లిక ఫ్రెండ్స్ పెళ్లి వేడుకలు చూసేందుకు పోట్లదుర్తికి వచ్చారు. మెహంది, పెళ్లికూతురును చేసే సంప్రదాయం, తలంబ్రాల వేడుకల చూసి వారు చాలా ఆనందించారు. నాలుగు రోజులగా ఇక్కడ వారు కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) ప్రొద్దుటూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధి లోని సబ్‌స్టేషన్ల మరమ్మతుల పనుల కోసం రెండవ శనివారం ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ వీజీ శ్రీనివాసులరెడ్డి ఓప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఐడీఏ ఫీడరు, 33 కేవీ మార్కెట్ యార్డు ఫీడర్, 33 కేవీ ప్రొద్దుటూరు టౌన్ ఫీడర్, 33 కేవీ మోడంపల్లె ఫీడర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో గల ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కోసం ప్రొద్దుటూరు టౌన్ మండల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

పోరుమామిళ్లలో: పోరుమామిళ్ల సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా పోరుమామిళ్ల టౌన్, పరిసర ప్రాంతాల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యు త్ శాఖ డీఈఈ రవిచంద్రశేఖర్, ఏఈఈ వెంకట మహేశ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఇందుకు సహకరించాలని వారు కోరారు.

ఘనంగా పచ్చ చిన్న వెంగయ్య ఏడో వర్ధంతి



పచ్చ చిన్నవెంగయ్యకు నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, పాఠశాల బృందం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):శ్రీవెంగమాంబ ఇంగ్లీషు మీడియం వ్యవస్థాపకులు పచ్చ చిన్న వెంగయ్య 7వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఆయన వర్ధంతి వేడుకల సందర్భంగా వెంగమాంబ హైస్కూలు వద్ద ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పూల మాలలు వేసి నివాళులర్పించారు., ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు భోజన ఏర్పాట్లు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

బద్వేలు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్థనరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టీ విరామ సమయంలో డిపో వద్ద ఎన్ఎంయూ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని డిపో సెక్రటరీ చంద్రయ్య, మల్లికార్జున, శ్రీధర్, కేవీ రమణ, ఆర్‌బీ రెడ్డి, భాస్కర్, ఎన్ఎస్ రాయుడు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగు ఆర్టీసీ గ్యారేజీ గేటు ఎదుట శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండో రోజు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమం నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి శివుడు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు కాంతయ్య, శ్రీనివాసులు, ఎస్ఎంవలి, కార్మికులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు మొక్కలే ఆధారమని డీసీసీ బ్యాంకు ఓఎస్డీ గురప్ప, చీఫ్ మేనేజరు చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం సోమిరెడ్డిపల్లె ప్రాథమిక సహకార సంఘాల పరపతి కార్యాలయంలో అంతర్జాతీయ సహకార వారోత్సవాలు - 2025 పురస్కరించుకుని సహకార కమిషనరు ఆదేశాల మేరకు ప్రతి సహకార సంఘంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు.

నేటి నుంచి నూతన ఆలయ ప్రారంభోత్సవాలు

ముద్దనూరు ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి):మండల పరిధి రాజులగురువాయపల్లె గ్రామంలో శనివారం నుంచి సోమవారం వరకు శ్రీగౌరీశంకరస్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 13న గ్రామోత్సవం, 14న విగ్రహాల ప్రతిష్ఠ, అన్నదానం ఉంటుందన్నారు. బండలాగుడు పోటీలు: నూతన ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా14వ తేదీన న్యూ కేటగిరి విభాగం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలో గెలుపొందిన ఎడ్లకు ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.40వేలు, తృతీయ బహుమతి రూ30వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు,ఐదవ బహుమతి రూ.15వేలు, ఆరవ బహుమతి రూ.12వేలు, ఏడవ బహుమతి రూ.10వేలు, ఎనిమిదవ బహుమతి రూ.8వేలు, తొమ్మిదవ బహుమతిరూ.5వేలు, పదో బహుమతి రూ.3వేలు అందిస్తున్నట్లు తెలిపారు.

హనుమద్ వాహనంపై ఆది చెన్నకేశవస్వామి

బద్వేలు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీదేవి భూదేవి సమేత ఆదిచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న జాతీయ బీసీసంక్షేమ సంఘ నాయకులు

ప్రొద్దుటూరు/టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):సామాజిక విప్లవకారుడు మహాత్మాజ్యోతిరావు పూలే అని దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లె ఎల్లయ్య మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద గల పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితం త్యాగం చేసిన మహనీయుడ న్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు గద్దం నరసింహులు, మేకల వెంకటన్న ,ఎల్లయ్య, చక్రినాయక్, బహుజన దళిత సమాఖ్యకన్వీనర్ పాగాల ఇనయతుల్లా , ఈశ్వర్ నాయక్ ,బాలుడు, పోలంకి శ్రీరాములు పాల్గొన్నారు. కాగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పట్టణంలోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలలో పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటక్రిష్ణయ్యయాదవ్, గౌరవ సలహాదారుడు నాగమల్ల శంకర్, ఉపాధ్యక్షుడు దేవానందం, ఇడెం లక్ష్మినారాయణ, వెంకటరాముడు, సుబ్బరాజు పాల్గొన్నారు. బీసీ ప్రజాచైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో బీసీ సమాఖ్య ఉపాధ్యక్షులు జీసీపుల్లయ్య ,ప్రతాప్, వేల్పుల భాస్కర్ జాయింట్ సెక్రటరీలు బత్తల శ్రీనివాసులు, గిద్దలూరు మల్లికార్జున, జింకారామకృష్ణ, జంకానాగేంద్ర, జలదుర్గం మునిస్వామి, మేరువ మూర్తి ,బోగా ఆనంద్, జిల్లా రచయిత సంఘం కార్యదర్శి జింకా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ బీసీసెల్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ మాట్లాడుతూ వెనుకబడిన, అణగారిన ప్రజల అభ్యున్నతికోసం జ్యోతిరావుపూలే ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి బాలయ్య, బాలరాజు, ప్రవీణ్‌కుమార్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థి యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు జగన్, బయన్న, దాసు, శ్రావణ్ పాల్గొన్నారు.



పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

బద్వేలు/రూరల్‌లో: స్త్రీ విద్యా వ్యాప్తికై పాటు పడిన జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న బిరుదు ఇవ్వాలని పూలే విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ గురుమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ గోపాలస్వామిలు పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా పట్టణంలోని పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్ టీఆర్ఐ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి,, పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు, కోశాధికారి పాలేటి శ్రీనివాసులురెడ్డి, సంఘమిత్ర చైర్మన్ సొద్దల పెంచలయ్య, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుబాన్‌బీపాల్గొన్నారు. దళితహక్కు పోరాట సమితి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలువేసి శుక్రవారం ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు సుధాకర్, రాజశేఖర్, బ్రహ్మయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో జ్యోతిరావుపూలే 198వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లయ్య పాల్గొన్నారు.

కొండాపురంలో: స్థానిక సీపీఐ కార్యాలయంలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు, డాక్టర్‌ప్రభాకర్‌రావు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: జ్యోతిరావుపూలే 198వ జయంతిని పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో రీజనల్ కన్వీనరు క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడి, సీపీఎస్ రాష్ట్ర కన్వీనరు సుబ్రమణ్యం, పుల్లయ్య, జయరామిరెడ్డి, బాషా, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరులో: దువ్వూరులో శుక్రవారం పూలే 198 జయంతి సందర్భంగా అజయ్‌బాబు అధ్యక్షతన మండల నాయకులు వినోద్, నాగరాజు, కార్యకర్తలు దువ్వూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలు గుర్తు చేసుకుని కొనియాడారు.

ఎర్రగుంట్లలో: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని ఎర్రగుంట్ల మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీపీపీలోని పూలే కాంస్య విగ్రహానికి సీఈ గౌరీపతి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఈలు, ఎస్‌పిఎఫ్, ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయభాస్కర్, రెడ్డెయ్య, రాజా, రాధాక్రిష్ణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో శుక్రవారం మహాత్మాజ్యోతిరావుపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జమ్మలమడుగు బీసీ సంక్షేమ సంఘం నాయకులు, నియోజకవర్గ అధ్యక్షుడు చౌడం జొల్లు కొండయ్య ఆర్డీవో కార్యాలయం వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆస్తులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

చాపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు వారి పూర్వపు ఆస్తులను పిల్లలకు సరైన ఆధారాలతో రిజిస్ట్రేషన్ చేయించాలని మైదుకూరు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఖాజామొయినుద్దీన్ అన్నారు. వెదురూరు గ్రామంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు, స్థలాలకు సంబంధించి అగ్రిమెంట్లు చెల్లవన్నారు. ఎవరైనా భూములు, స్థలాలు కొనుగోలు చేసేటప్పుడు సరైన ఆధారాలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. కోర్టు నుంచి ఏదైనా సమాచారం వస్తే ప్రజలు తప్పకుండా స్పందించాలన్నారు. మొబైల్ ఫోన్లతో విద్యార్థులు చెడు అలవాట్లకు గురికాకుండా తల్లిదండ్రులు వారి కదలికలపై దృష్టిపెట్టాలన్నారు. ద్విచక్ర వాహనాలను హెల్మెట్ లేకుండా నడిపితే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. బార్ అసోసియేషన్ సెక్రటరి ఆకుల శివరాం, అడ్వకేట్లు శ్రీనివాసులు, శివరామకృష్ణ, కరిముల్లా, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గం ఎంపిక



బద్వేలు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ బద్వేలు, గోపవరం మండలాల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం బద్వేలు ఆర్ఎస్ఎస్ సంఘ్ చాలక్ రామకోటి రాజు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బద్వేలు మండల అధ్యక్షుడిగా పెరుగు వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా సుధాకర్, గంగనపల్లె మురళి, కార్యదర్శిగా బాలరాజు, కోశాధికారిగా శ్రీనివాసులు, భజరంగ్‌దళ్ ప్రముఖ్‌గా వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోపవరం మండల అధ్యక్షుడిగా పత్తిపాటి నరసింహులు, ఉపాధ్యక్షులుగా తిరుపాలయ్య, గోపవరం శ్రీనివాసులు, కార్యదర్శిగా పిట్ట వేణుయాదవ్, సహ కార్యదర్శిగా రాజేశ్, కోశాధికారిగా చెప్పలి మధు, భజరంగ్‌దళ్ ప్రముఖ్‌గా సురేశ్‌రాజులను ఎంపిక చేశారు.

ప్రొద్దుటూరులో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు పాలెం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి ఆదరణ పెరుగుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. ర్యాలీలో మాజీ జిల్లా అధ్యక్షుడు పుష్పాల శ్రీనాథ్‌రెడ్డి, సీవీ జయలక్ష్మి, హరినారాయణ, గౌరీ, నరేంద్రరావు, గురురాజేష్, రవి, గురు, కొండయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీజేవైఎం సభ్యులు పాల్గొన్నారు.

పిల్లల పోషణ పట్ల జాగ్రత్త వహించాలి

కొండాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పిల్లల పోషణ పట్ల జాగ్రత్త వహించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. మండలంలోని బి.కొట్టాలపల్లె, బెడుదూరు, నేదరపేట అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం పోషకాహార పక్షోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళాపోలీస్ తదితరులు పాల్గొన్నారు.